# క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంగఠన్ (కే.ఏ.ఎం.ఎస్.)

## దండకారణ్యం

### పత్రికా ప్రకటన

మార్చ్ 3, 2012

# మార్చి 8 – అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం వర్ధిల్లాలి!

# రాజ్యహింసకు వ్యతిరేకంగా మహిళల ప్రతిఘటనను పెంపొందిద్దాం!

## మార్చి 8 సందర్భంగా గ్రామగ్రామాన సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ప్రదర్శనలు నిర్వహించి కామ్రేడ్ రణిత సాహసపోరును ఆదర్శ నమూనాగా ఎత్తిపడుదాం!

'మార్చి 8' ప్రపంచవ్యాప్తంగా పోరాడే ప్రజలకు, ప్రత్యేకించి మహిళలకు స్ఫూర్తిదాయకమైన రోజు. 1908లో న్యూయార్క్ కార్మిక మహిళలు తమ హక్కుల కోసం పోరాడిన దినమిది. ఈ మహిళల పోరాటానికి ఉత్తేజితురాలైన జర్మన్ కమ్యూనిస్టు నాయకురాలు క్లారా జెట్కిన్ 1910లో ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా పోరాడే మహిళలు ఈ దినాన్ని ఉత్తేజవంతంగా జరుపుకుంటున్నారు. అందులో భాగంగా దండకారణ్యంలో క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్ పిలుపు మేరకు, మహిళలు గత కొన్నేళ్లుగా ప్రతి సంవత్సరం మార్చి 8ని పోరాట దినంగా జరుపుకుంటున్నారు.

మార్చి 8ని జరుపుకోవడం అంటే ఒక పండుగనో, వేడుకనో జరుపుకోవడం కాదు. తరతరాలుగా పోరాడుతున్న మహిళల పోరాటాన్ని కొనసాగించడం. నేడు దండకారణ్య మహిళలు తమ విముక్తి కోసం పోరాడుతున్నారు. దండకారణ్య మహిళల విముక్తి అనేది దేశంలోని పీడిత ప్రజలందరి విముక్తితో ముడిపడి వుంది. మహిళలు విముక్తిని పొందడం అంటే భూస్వామ్యాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని, సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించడం; పితృస్వామ్యాన్ని అంతం చేయడం; నిజమైన అర్థంలో జల్, జంగల్, జమీన్‌లపై తమ హక్కును కాపాడుకోవడం.

ఆ లక్ష్యంతోనే నేడు ఇక్కడి మహిళలు ప్రధానంగా క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘంలో సంఘటితమవుతున్నారు. అట్లాగే పార్టీలోనూ, పీఎల్‌జీఏలోనూ, విప్లవ జనతన సర్కార్లలోనూ, వివిధ విభాగాలలోనూ క్రియాశీల పాత్ర పోషిస్తూ తమ వర్గ సోదరులతో భుజం భుజం కలిపి పోరాడుతూ ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకుపోతున్నారు. ఈ క్రమంలో అనేక త్యాగాలను చేస్తూ తమ నెత్తుటితో నూతన చరిత్రను నిర్మిస్తున్నారు.

అందుకే మార్చి 8 అన్నా, మహిళా సంఘాలన్నా, మహిళా వుద్యమమన్నా పాలకవర్గాలు ఉలికిపాటుకు గురవుతున్నాయి. మావోయిస్టు పార్టీని దేశ ఆంతరంగిక భద్రతకు అతి పెద్ద ప్రమాదంగా ప్రకటించిన పాలకవర్గాలు 2006 నుండి దేశవ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమంపై తీవ్రమైన అణచివేతను ప్రయోగిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం ఈ అణచివేత ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో అమలవుతున్నది. ఇందులో భాగంగా మహిళలను ప్రత్యేకంగా లక్ష్యం చేసుకోవడం స్పష్టంగా కనబడుతున్నది. సంఘ, పార్టీ కార్యకర్తలే కాక సాధారణ మహిళలు కూడా క్రూర రాజ్యహింసకు బలవుతున్నారు.

ఎంతో మంది మహిళలను, ఉద్యమకారిణులను పోలీసులు, అర్ధ సైనిక బలగాలు అరెస్టు చేయడం, చిత్రహింసలు పెట్టడం, జైళ్లలో బంధించడం, అత్యాచారాలు, హత్యలు చేయడం సర్వసాధారణమైంది. క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్ నాయకురాలు కామ్రేడ్ నిర్మల సహా అనేక మంది మహిళా కార్యకర్తలు సంవత్సరాల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు. కామ్రేడ్ మాలతికి ఒక తప్పుడు కేసులో పదేళ్ల శిక్ష వేశారు. ఇంతేకాక ఇటీవలి కాలంలో హంతక ముఠాలను ఏర్పాటు చేసి మహిళలపై దాడులు చేస్తున్నారు. ఇలా రోజు రోజుకూ మహిళలపై రాజ్యహింస పెరిగిపోతున్నది. సరిగ్గా సంవత్సరం క్రితం ఇదే నెలలో సాయుధ బలగాలు చింతల్‌నార్ ప్రాంతంలో సాగించిన బీభత్సకాండలో మహిళల మీద జరిగిన అత్యాచారాలు మనం ఎరిగివున్నదే. ఈ సంఘటనలో మోర్‌పల్లి గ్రామానికి చెంది హేమ్లు మూడె అనే మహిళపై, తన ఇద్దరు కూతుళ్ల కళ్లెదుటే ప్రభుత్వ సాయుధ బలగాలు అత్యాచారానికి పాల్పడ్డారు. గంగ అనే మరో మహిళపై కూడా ఈ 'భద్రతా' బలగాలు బలాత్కారానికి పాల్పడ్డాయి. మాడివి భీమె అనే 80 ఏళ్ల వృద్ధురాలిని కూడా అమానుషంగా కొట్టారు. మాడివి లక్కె అనే యువతిని ఆమె తండ్రి, సోదరుడితో కలిపి పట్టుకొని చింతల్‌నార్‌కు తీసుకెళ్లి, సెల్‌లో ఒంటరిగా బంధించి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. పులాన్‌పాడ్‌లో కూడా ఒక మహిళపై అత్యాచారానికి పాల్పడ్డారు.

మీనా ఖల్కో క్రూర హత్య, సోనీ సోడి అరెస్టు, చిత్రహింసల నేపథ్యంలో మహిళలపై జరుగుతున్న రాజ్యహింస భయంకర స్వభావం మరోసారి బాగా వెలుగులోకి వచ్చింది. మీనా ఖల్కో సర్గూజా జిల్లాలోని కర్చా గ్రామానికి చెందిన పదిహేనేళ్ల అమ్మాయి. 2011 జూలై 5న ఈ అమ్మాయి పోలీసుల క్రూరత్వానికి బలైంది. ఒక మైనర్ బాలికపై తాము పాల్పడిన దారుణ అత్యాచారాన్ని కప్పిపుచ్చుకోవడానికి పోలీసులు ఆ అమ్మాయిని అమానుషంగా కాల్చిచంపారు. ఆ తర్వాత నక్సలైట్లతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆ అమ్మాయి చనిపోయినట్టుగా ప్రకటించారు. అయితే ఆ అమ్మాయి మీద అత్యాచారం జరిగిందని ఆధారాలతో సహా బయటపడ్డంతో ఆ అమ్మాయి తిరుగుబోతనీ, తాగుబోతనీ ప్రచారం మొదలుపెట్టారు. అత్యాచారం జరిగిందనే ఆధారాలున్నప్పటికీ పోలీసులే అత్యాచారం చేశారని భావించడానికి వీల్లేదని సర్గూజా రేంజ్ ఐజి

రాజేష్ మిశ్రా నిస్సిగ్గుగా మాట్లాడాడు. మీనా ఖల్కోను హత్యచేసి, ఆమె చరిత్రకు మసి పూయడం ద్వారా రాజ్యం తనలోని కరడుకట్టిన పితృస్వామ్య భావజాలాన్ని నగ్నంగా చాటుకుంది.

సోనీ సోడి (36) ఒక ఆదివాసీ మహిళా ఉపాధ్యాయురాలు. ఈమెకు మావోయిస్టులతో సంబంధాలున్నాయనీ, ఎస్సార్ అనే బహుళజాతి కంపెనీ నుండి మావోయిస్ట్ పార్టీకి డబ్బులను చేరవేస్తున్నదనే తప్పుడు ఆరోపణలతో 2011 అక్టోబర్‌లో పోలీసులు అరెస్టు చేశారు. రెండు రోజులు అక్రమంగా నిర్బంధించి క్రూరంగా హింసించారు. చెప్పనలవి గాని రీతిలో లైంగికంగా హింసించారు. ఆ తర్వాత జైలులో బంధించారు. జైలులో వున్న ఆమెను కలవడానికి మహిళా సంఘాల కార్యకర్తలకు అనుమతిని ఇవ్వకుండా రమణ్‌సింగ్ సర్కార్ తన ఫాసిస్ట్ వైఖరిని మరోసారి చాటుకుంది. సోనీ సోడి అక్రమ అరెస్టుకూ, పోలీసుల చిత్రహింసలకు వ్యతిరేకంగా పలు మహిళా సంఘాలు గళమెత్తాయి.

అయితే పెరుగుతున్న ఈ రాజ్యహింసను మహిళలు నిర్భయంగా ప్రతిఘటిస్తున్నారు. తనను చుట్టుముట్టిన వందల సాయుధ బలగాలతో కామ్రేడ్ రణిత ఒంటరిగా తలపడిన తీరు ఈ ప్రతిఘటనకు అద్భుతమైన నమూనాగా నిలుస్తుంది. కామ్రేడ్ రణిత అసలు పేరు రాంకో హిచ్చామి. గడ్చిరోలి జిల్లా ఏటపల్లి తాలూకాలోని పొటావి జెవెల్లి గ్రామంలో దాదాపు 35 ఏళ్ల క్రితం పుట్టింది. 1999లో విప్లవోద్యమంలో చేరిన ఈమె క్రమంగా చాద్‌గాం ఏరియా విప్లవ జనతన సర్కార్ అధ్యక్షురాలిగా ఎదిగింది. 2011 ఆగస్ట్ 20న చాద్‌గాం ఏరియాలోని మాకడ్‌చువ్వ అనే గ్రామానికి వెళ్లినప్పుడు పోలీసుల చక్రబంధంలో ఒంటరిగా చిక్కుకు పోయింది. అయినా ఏ మాత్రం గందరగోళానికీ, భయానికీ గురికాకుండా సమీపంలో వున్న జొన్న చేనును ఆధారం చేసుకొని వీరోచిత పోరాటానికి ఒక ఉజ్వల నమూనాను నెలకొల్పింది. పోలీసులు విచ్చలవిడిగా కురిపించిన తూటాల, బాంబుల వర్షాన్ని, లొంగిపొమ్మని అరిచే అరుపులను ఏ మాత్రం లెక్కచెయ్యకుండా, చివరి ఊపిరి వరకూ ఎత్తిన తుపాకీని దించకుండా ఇద్దరు కోబ్రాలు సహా ముగ్గురు కమాండోలను నేలకూల్చి, నల్గురు కమాండోలను తీవ్రంగా గాయపర్చింది. దాదాపు పది గంటల సేపు పోరాడిన తర్వాత ఆమె వీరమరణం పొందింది. ఆమె అనుభవం గెరిల్లాలకు విలువైన, నేర్చుకోవాల్సిన పాఠం అయింది. 'మహిళలు పనిలో యుద్ధంలో పురుషులతో పోటీ పడలేరు' అనే పితృస్వామ్య భావనను బద్దలు కొట్టిన ఆయుధం అయింది.

ఇటీవలి కాలంలో మహిళా గెరిల్లాలు ఒంటరిగా వున్న సమయంలో హంతక ముఠా సభ్యులు తారసపడిన సందర్భాల్లో ధైర్యంగా ఎదుర్కొన్న కొన్ని సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలు మహిళల మొక్కవోని సాహసానికి కొన్ని ఉదాహరణలు. సాయుధంగానే కాదు, నిరాయుధంగా సైతం మహిళల ప్రతిఘటన అప్రతిహతంగా కొనసాగుతూనే వుంది. చింతల్‌నార్ మారణకాండ సందర్భంగా పోలీసులు పట్టుకున్న వారిని మోర్‌పల్లి మహిళలు ప్రతిఘటించి విడిపించుకున్నారు. ఈ విధంగా దండకారణ్య వ్యాప్తంగా పోలీసులు పట్టుకున్న వారిని మహిళలు సాహసంగా పోరాడి విడిపించుకున్న సంఘటనలు అనేకం జరిగాయి. పోలీసులు పట్టుకెళ్లి పోలీసుస్టేషన్లలో, క్యాంపులలో బంధించిన వారిని సైతం మహిళలు ప్రాణాలకు తెగించి పోరాడి విడిపించుకుంటున్నారు. కాంకేర్ జంగల్ వార్‌ఫేర్ స్కూల్లో శిక్షణను పొందుతున్న పోలీసు జవాన్లు మహిళపై పాల్పడే అత్యాచారాలు, లైంగిక వేధింపులు, తదితర అత్యాచారాలకు వ్యతిరేకంగా చుట్టుపక్కల గ్రామాల మహిళలందరు అధికారులను ఘెరావ్ చేశారు.

దండకారణ్యంలోనే కాదు నేడు దేశంలోని అనేక ప్రాంతాల్లో మహిళల ప్రతిఘటనా పోరాటం కొనసాగుతున్నది. లాల్‌గఢ్, నారాయణపట్నా ప్రజా పోరాటాల్లో మహిళల పాత్ర ఎంతో సమరశీలమైనది. సెజ్‌లు, అణువిద్యుత్ కేంద్రాలు, గనులు, భారీ ప్రాజెక్టులు, ఇంకా అభివృద్ధి పేరుతో తీసుకువస్తున్న పలు విస్థాపన, వినాశకర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాల్లో మహిళల భాగస్వామ్యం ఎంతో స్ఫూర్తిదాయకమైనది.

తమ సాయుధ బలగాలను రెచ్చగొట్టి ఒకవైపు మహిళలపై విచ్చలవిడి హింసా దౌర్జన్యాలను సాగిస్తున్న ప్రభుత్వాలు మరోవైపు అంతర్జాతీయ మహిళా దినాలను జరపడం విచిత్రకరం. కాశ్మీర్ నుండి మొదలుకొని కన్యాకుమారి వరకూ దేశం నలుమూలల్లో జరిగే న్యాయమైన పోరాటాలను అణచడం కోసం మహిళలపై లైంగిక అత్యాచారాలను ఒక ఆయుధంగా ప్రయోగిస్తున్న దోపిడీ పాలకవర్గాలు మహిళా సాధికారత వంటి బూటకపు మాటలు వల్లిస్తున్నాయి. ఇటువంటి దోపిడీ పాలక వర్గాల ముసుగును తొలగించడానికి, వాటి మహిళా వ్యతిరేక ముఖాన్ని బహిర్గతం చేయడానికి మార్చి 8 సరైన సందర్భం. కాబట్టి ఈ మార్చి 8న సమరోత్సాహంతో అంతర్జాతీయ మహిళా దినాన్ని జరుపుకుందాం. మహిళలపై అమలవుతున్న రాజ్యహింసకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పీడిత మహిళలందరితో కలిసి గళమెత్తుదాం.

- ✶ **మహిళలపై ప్రభుత్వ నిర్బంధం నశించాలి! ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను రద్దు చేయాలి!**
- ✶ **'శిక్షణ' పేరుతో దండకారణ్యంలో దించిన భారత సైన్యాన్ని వెనక్కి తీసుకోవాలి!**
- ✶ **మీనా ఖల్కో దారుణ హత్యను ఖండించండి! పోలీసు అధికారులను శిక్షించండి!**
- ✶ **సోనీ సోడిని బేషరతుగా విడుదల చేయాలి! ఆమెపై చిత్రహింసలకు పాల్పడ్డ దోషులను కఠినంగా శిక్షించాలి!**
- ✶ **చింతల్‌నార్ బీభత్సకాండకు సూత్రధారులైన రమణ్‌సింగ్, ననకీరాం, శేఖర్ దత్, విశ్వరంజన్, లాంగ్‌కుమేర్, కల్లూరి తదితర పోలీసు, కోయ కమాండోలందరినీ కఠినంగా శిక్షించాలి!**

**(బయ్య వేలాది)**

**అధ్యక్షురాలు**

**క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంగఠన్ (కే.ఏ.ఎం.ఎస్.)**

**దండకారణ్యం**